TGTEL/25/A0827

# ప్రజా దివాన్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

## విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 210 | గురువారం 23-07-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

# కాంగ్రెస్ ఓట్లు తొలగించేవందెకు బిజెపి ఎత్తులు




## కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు

**ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోండి సర్‌పై బూత్‌లెవల్ కార్యకర్తలతో సిఎం రేవంత్**

వికారాబాద్,జూలై22: కొడంగల్ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్‌కు రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్‌లో పర్యటించిన సీఎం.. స్థానిక నాయకులు, బీఎల్‌ఏలతో సర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో దెబ్బతీయాలంటే పునాదులు దెబ్బతీయాలని చూస్తున్నారు. పేర్లు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే. కొడంగల్‌లో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించాలని చూస్తున్నారు. ఇంట్లో పొగ పెడితే రేవంత్ రెడ్డి బయటకు రాకుండా ఉంటారని కుట్రలు చేస్తున్నారు. ఎదురు నిలబడలేక దొంగదెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారు. కొడంగల్‌లో కుట్రలు చేసేవారిని బొంద పెట్టే బాధ్యత మీపై ఉందని సిఎం అన్నారు. 119 నియోజకవర్గాలను అభివృద్ధి చేయడం కోసం రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవడంలేదని సీఎం తెలిపారు. ఆగస్టు 3 వరకు సర్ గడువు ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,51,255 ఓట్లున్నాయని.. కానీ 1,96,626 ఓట్లు మాత్రమే సర్‌లో నమోదు చేసుకున్నారని.. మిగిలిన 54,635 నమోదు చేసుకోలేదని సీఎం తెలిపారు. మొత్తం ఓట్లలో ఇంకా 22 శాతం నమోదు జరగలేదని చెప్పారు. ఆ ఓట్లను తొలగిస్తే ప్రమాదం పొంచి ఉందన్నారు. వారందరినీ తిరిగి నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎల్‌ఏలపై ఉందన్నారు. ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదని సీఎం తెలిపారు. ఓటు లేకుంటే చనిపోయిన వారితో సమానమన్నారు. కార్యకర్తగా ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ ఫారం నమోదు చేయించాలని నేతలకు సూచించారు.

పేజి 2లో ▶

# పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

## ఒక్క దాంటలో కూడా దోషులను తేల్చలేదు

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాల్సిందే
- మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ డిమాండ్



2లో

# కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్‌కు నిరసన



**కొడంగల్‌లో రేవంత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సిఎం డిమాండ్**

: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తదితరుల అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టింది. కొడంగల్ ర్యాలీలో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను అమ్ముకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దిల్లీలో నిన్న రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును వ్యతిరేకిస్తూ కొడంగల్‌లోని అంబేడ్కర్ కూడలిలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈసందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... నీట్ ప్రశ్నపత్రాలను పల్లీబఠానీల్లా కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలకతీతంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని, పేజి 2లో ▶

# విద్యార్థుల నిరసనలను రాజకీయాలకు వాడుకోవద్దు: నడ్డా



2లో

# మంగళగిరి కోసం బాబుతో గొడవ పడ్డా



- నిధులకు కొరత ఉన్నా, అభివృద్ధిలో వెనకడుగు లేదు
- నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీలో లోకేశ్

మంగళగిరి నియోజకవర్గంలో రెండో రోజు పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. 'మన ఇల్లు - మన లోకేశ్' పేరిట మంత్రి నారా లోకేశ్.. ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టారు. రెండు రోజుల్లో 3,000 మందికి పట్టాలను పంపిణీ చేయనున్నారు. పేజి 2లో ▶

# పంచదార్ల కొండపై అక్రమ మైనింగ్..

## సమగ్ర విచారణకు పవన్ ఆదేశం



- పంచదార్ల కొండ అక్రమ మైనింగ్‌పై పవన్ ఆగ్రహం
- సమగ్ర విచారణకు అధికారులకు ఆదేశాలు
- నిబంధనలు ఉల్లంఘించిన సంస్థపై కఠిన చర్యలు
- జరిమానాతో పాటు పర్యావరణ పునరుద్ధరణ బాధ్యత
- జలధారలపై NIH శాస్త్రవేత్తలతో అధ్యయనం
- పంచదార్ల కొండను 'నో మైనింగ్ జోన్'లలిగా ప్రకటించాలని సూచన
- మైనింగ్ సంస్థ పర్యావరణ అనుమతులు రద్దు చేయాలని ఆదేశం

2లో

# పేదల సొంత ఇంటి కలను మేం నెరవేరుస్తున్నాం: పొంగులేటి



- పేదల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నాం: పొంగులేటి
- రాష్ట్రంలో ఇప్పటికే 7.5 లక్షల ఇళ్ల మంజూరు
- హైదరాబాద్‌లో మీసేవ ద్వారా దరఖాస్తులు
- పాత దరఖాస్తుదారులు కూడా మళ్లీ అప్లై చేయాలి
- గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట మోసం చేసిందని విమర్శ
- ప్రజల సమస్యలపై గాంధీభవన్‌లో అర్జీలు స్వీకరణ

హైదరాబాద్: పేదవాడి ఆత్మగౌరవమైన సొంత ఇంటి కలను మేం నెరవేరుస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను ఆయన స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రజల బాధలు వినడానికి ఎలాంటి అవకాశం ఉండేది కాదన్నారు. "రాష్ట్రంలో ఇప్పటికే 7.5 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. గతంలో హైదరాబాద్ వంటి నగరంలో సొంత ఇల్లు కలగానే ఉండేది. అప్పట్లో డబుల్ బెడ్ రూమ్ అంటూ మాయ మాటలు చెప్పి మోసం చేశారు. మేం హైదరాబాద్‌లో ఎకరం రూ.200 కోట్లు ఉన్నా.. ప్రజల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నాం. నగర ప్రజలు ఇళ్ల కోసం 'మీసేవ'లో అప్లై చేసుకోవాలి. గతంలో

# 22ఏ భూముల నిబంధనలపై కొత్త జీవో:



2లో

# పనిచేస్తున్న సంస్థకే కన్నం..

## భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు




హైదరాబాద్: బంజారాహిల్స్‌లో భారీ చోరీ కేసును టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. పనిచేస్తున్న సంస్థకే కన్నం వేసి కిలోకి పైగా బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన సోదరులు సోంకాంబ్లే హరీశ్, సొంకాంబ్లే ఆకాశ్‌ను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు.

2లో

# సంపాదకీయం

## కాక్రోచ్ దండు కదను తొక్కిన వేళ..

'చరిత్ర గమనాన్ని మార్చడానికి గొప్ప శక్తులు అవసరం లేదు. తమ లక్ష్యంపై మొక్కవోని విశ్వాసంతో రగిలిపోతున్న దృఢ సంకల్పం గల కొద్దిమంది వ్యక్తుల సమూహం కూడా మార్పును సాధ్యం చేయగలదు 'అని మహాత్మాగాంధీ అన్నారు. భారతదేశం ఇప్పుడు ఒక అనిర్వచనీయ మార్పు దిశగా సాగుతున్నట్లు కనపడుతోంది. నీట్ ప్రశ్నపత్రాల లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ నెల రోజులుగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) కార్యకర్తలు సోమవారం దేశ రాజధానిలో వర్షాకాల సమావేశాల తొలి రోజు పార్లమెంటును ముట్టడించడం ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న ఒక బృహత్పరిణామం అని చెప్పక తప్పదు. నాలుగంచెల బారికేడ్లు ఏర్పాటు చేసి, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్పీఎఫ్, ఢిల్లీ, త్రిపుర పోలీసు బలగాలను పెద్ద ఎత్తున మోహరించినా, మెట్రో స్టేషన్లను మూసివేసినా, ఇంటర్నెట్ దిగ్బంధనం చేసినా సరే.. వేల సంఖ్యలో ఉన్న కాక్రోచ్ దండు పార్లమెంటు గేట్ల వరకు దూసుకెళ్లింది. పోలీసులు చితకబాదుతున్నా యువతీ యువకులు తెగింపు ప్రదర్శించారు. రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో గాయాలతో పడి ఉన్న యువతీ యువకులే సోమవారం నాటి దమనకాండకు ప్రత్యక్ష సాక్షులు.

ఒక దశాబ్దానికి పైగా ప్రతిపక్షాలు ఎన్ని దాడులు, విమర్శలు చేసినా చలించని మోదీ ప్రభుత్వం బొద్దింకల తిరుగుబాటు ఉదంతంతో ఆత్మరక్షణలో పడ్డట్లు స్పష్టమవుతోంది. కాక్రోచ్ పార్టీ ప్రారంభించిన ఉద్యమంలో ఎంతమంది పాల్గొన్నారు అన్నది ముఖ్యం కాదని, దాని ప్రభావం ఎంత మేరకు ఉన్నది అన్నదే ముఖ్యమని బీజేపీ ఎంపీ ఒకరు చెప్పారు. 'మా నాన్న బీజేపీలో అతి ముఖ్యమైన నాయకుడు. అయితే సంభవిస్తున్న పరిణామాలు అంత ఆరోగ్యకరంగా లేవు..' అని జంతర్ మంతర్ ధర్నాలో పాల్గొన్న ఒక యువకుడు అన్నారు. 'రాజకీయ నాయకులు విఫలమైన చోట పిల్లలే ప్రశ్నిస్తారు..' అని ఒక విద్యార్థి అన్నారు.

నిజానికి కాక్రోచ్ జనతా పార్టీ ఒక సంస్థ కాదు. దేశ వర్తమాన చరిత్రలో దిక్కుతోచని యువతీ యువకుల సమూహమది. జంతర్ మంతర్ వద్ద ధర్నాకు వచ్చినవారు కానీ, ఊరేగింపులో పాల్గొన్నవారు కానీ ఎవరో డబ్బులిచ్చి పిలిస్తే వచ్చినవారు కాదు. వారి రాక కోసం ఎవరూ బస్సులు, రైళ్లు ఏర్పాటు చేయలేదు. కేవలం సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చే వారిని ఢిల్లీకి బయలుదేరేలా చేసింది. కేవలం నీట్ ప్రశ్న పత్రాల లీక్‌కు మాత్రమే రగిలిపోతూ వారు రాలేదు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా నిరుద్యోగం, చాలీచాలని జీతాలు, వ్యవస్థలో లోపాలు, రాజకీయ పార్టీల కుతంత్రాలను చూసి విసిగిపోయినవారే ఆ వచ్చిన యువతీయువకులు. జంతర్ మంతర్ ధర్నా స్థలానికి వచ్చిన వారికి ఒక లక్ష్యం అంటూ ఏమీ లేదు. 14--28 సంవత్సరాల మధ్య వయసు ఉన్న యువతను లెఫ్ట్, రైట్ అనే సిద్ధాంతాల మూసలో ఇమడ్చలేము. ఎమర్జెన్సీ వారి అనుభవంలో లేదు. ఒకప్పుడు ప్రతిపక్షాలను ఏకం చేసిన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ గురించి వారికి తెలియదు. మండల్, కమండల్ ఉద్యమాల అనుభవం సైతం వారికి లేదు. మూడు దశాబ్దాల క్రితం జరిగిన సంఘటనల జ్ఞాపకాలు వారికి లేవు. వర్తమాన సమస్యలతో సతమతమవుతూ తాము ఏమి చేయాలో తేల్చుకోలేక, భవిష్యత్తు అగమ్యగోచరమై, రకరకాల ప్రశ్నలతో వచ్చినవారు.. వారు ఏ సంప్రదాయక సూత్రాలకూ కట్టుబడి లేరు. తామే ప్రశ్నలు వేసుకుంటూ, తామే జవాబులు ఇచ్చేందుకు గడచిన నాలుగు వారాలుగా ఈ ధర్నా వేదిక వారికి ఉపయోగపడింది. ఆ నిరసన గురించి సోషల్ మీడియాలో విశేషంగా ప్రచారమయింది. మూడు వారాలకు పైగా నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై యువత ఎంత ఆందోళన చెందిందో ప్రత్యామ్నాయ మీడియా సాధనాల్ని పరిశీలిస్తే అర్థమవుతుంది.

ప్రతిపక్షాలకు విశ్వసనీయత లేదని, అందుకే తమకు ప్రత్యామ్నాయం అంటూ ఏమీ లేదని, తాము ఏమి చేసినా చెల్లుతుందని విశ్వసించిన మోదీ సర్కార్.. కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావాన్ని తక్కువ అంచనా వేసినట్లే కనిపిస్తోంది. సాగునీటి చట్టాలపై రైతులు, పౌరసత్వ సవరణ చట్టంపై ముస్లింలు సుదీర్ఘకాలం చేసిన నిరసన ప్రదర్శనలను మోదీ ప్రభుత్వం అవలీలగా ఎదుర్కోగలిగింది. తమపై జరిగిన అత్యాచారాల్ని ప్రశ్నించిన మహిళా మల్లయోధుల ఆక్రందననూ ఆలకించలేదు. దేశంలో ఏ ఉద్యమం జరిగినా దాని విశ్వసనీయతను దెబ్బతీసేందుకు రకరకాల మార్గాలను అవలంబించింది. ఆందోళనకారులను రకరకాల పేర్లతో దుయ్యబట్టింది. ఇప్పుడు పోటెత్తిన యువత ఆందోళనను శాంతిభద్రతల సమస్యగా భావించి, దాన్ని అణచివేస్తే సరిపోతుందని మోదీ సర్కార్ భావించింది. కాక్రోచ్ పార్టీ నిరసన ప్రదర్శన తారస్థాయికి చేరుకుంటున్న సమయంలో ఢిల్లీ పోలీసు కమిషనర్ సతీశ్ గోల్చాను తొలగించి ఆయన స్థానంలో ఇప్పటి వరకూ స్పెషల్ డైరెక్టర్ (ఇంటెలిజెన్స్)గా ఉన్న అనురాగ్ కుమార్‌ను నియమించారు. జమ్మూ--కశ్మీర్ డెస్క్ ఇన్‌చార్జిగా ఆయన.. కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను విచ్ఛిన్నం చేయడంలో కీలకపాత్ర పోషించారు. అలాంటి వ్యక్తి అదే మనస్తత్వంతో యువతీ యువకుల ఆందోళనను అణచివేసే ప్రయత్నం చేయడంలో ఆశ్చర్యం లేదు.

యూపీఏ ప్రభుత్వ హయాంలో కూడా నిర్భయ అత్యాచారానికి వ్యతిరేకంగా యువతీ యువకులు వీధుల్లోకి వెల్లువెత్తారు. అయితే నాడు సోషల్ మీడియా ఇప్పుడున్నంత ప్రభావవంతంగా లేదు. సోషల్ మీడియా ఇవాళ ప్రజలకు ప్రత్యామ్నాయ మీడియాగా మారిందనడంలో సందేహం లేదు. నిజానికి మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు బీజేపీ ఐటీ సెల్ ప్రజలను సంఘటితం చేసేందుకు, ముఖ్యంగా హిందువుల భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు రకరకాల ప్రచారాలు చేసింది. ముఖ్యంగా వాట్సాప్ యూనివర్సిటీలను అధికంగా ఉపయోగించుకుంది. ఇప్పుడు జెన్ జీ తరం చేతుల్లో ఉన్న సోషల్ మీడియా ముందు ఆ ఐటీ సెల్ ప్రచారాలు వెలవెలబోతున్నట్లు కనిపిస్తోంది. ఏ ప్రచారమైనా ప్రజల మనోభావాలకు తగ్గట్లు లేకపోతే ఎక్కువ కాలం నిలబడదని ఈ పరిణామం రుజువు చేస్తోంది.

మోదీ ఏ వాగ్దానాలతో ప్రజల ముందుకు వచ్చారో ఆ వాగ్దానాలు తెరమరుగుకావడం, భావోద్వేగ అంశాలే ప్రధాన అజెండాగా మారడం, నేటి తరం గమనించకపోలేదు. ఉద్యోగాలు కల్పించకపోవడం సరే, కనీసం పరీక్షల్ని సవ్యంగా నిర్వహించలేకపోవడం, నాణ్యమైన విద్యను అందించలేకపోవడం, అధికారమే పరమావధిగా అనేక కుతంత్రాలకు, అధర్మ యుద్ధాలకు పాల్పడడాన్ని వారు నిశితంగా గమనిస్తున్నారు. అయినప్పటికీ ప్రతిపక్షాలను, ముఖ్యంగా కాంగ్రెస్‌ను నేటి తరం నెత్తికెక్కించుకుంటోందని చెప్పడానికి ఆధారాలు ఏవీ లేవు. ఒక దశాబ్దకాలంగా కాంగ్రెస్, ఇతర పార్టీలు మోదీ పట్ల ప్రజా వ్యతిరేకత రగిలించడంలో విఫలమయ్యాయన్నది సందేహాతీత వాస్తవం. అయితే ప్రతిపక్షాలు విఫలమైన చోట యువత బయలుదేరుతుందని ఎవరూ ఊహించలేదు. కాంగ్రెస్ పార్టీయే బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించి, యువత ఆకాంక్షల్ని ప్రతిఫలించి ఉంటే కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భవించి ఉండేది కాదు. మోదీని ఎదుర్కోవడంలో విఫలమైన అనేక శక్తులు ఇప్పుడు కాక్రోచ్ దండులో కనపడడం ఆసక్తికరమైన విషయం.

విచిత్రమేమంటే పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజు ప్రభుత్వం ప్రవేశపెట్టదలుచుకున్న బిల్లుల గురించి కానీ, ప్రతిపక్షాలు లేవనెత్తదలుచుకున్న సమస్యల గురించి కానీ జనం పట్టించుకోలేదు. కాక్రోచ్ జనతా పార్టీ ఇచ్చిన 'చలో సంసద్' పిలుపునకే ఎంతో ప్రాచుర్యం లభించింది. ఒక రకంగా ఈ పరిణామం ప్రభుత్వ అస్తిత్వాన్నే కాదు, ప్రతిపక్షాల అస్తిత్వాన్ని కూడా ప్రశ్నార్థకం చేసింది. కాక్రోచ్ జనతా పార్టీ ధర్నాపై ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు యువతపై లాఠీచార్జి జరగడం గురించి గగ్గోలు పెట్టడం కానీ, ప్రధానమంత్రి నివాసం ఎదుట రాహుల్‌గాంధీ ధర్నా చేయడం కానీ కాంగ్రెస్ తన అస్తిత్వాన్ని నిరూపించుకోవడంలో భాగమే. కాక్రోచ్ జనతా పార్టీ అనుభవంతోనైనా కాంగ్రెస్ బలమైన ప్రతిపక్షంగా పునరుత్థానం చెందుతుందా లేదా అన్నదానికి కాలమే సమాధానం చెబుతుంది. మోదీకి కూడా ప్రతిపక్షం ఎంతో కొంత ఉనికిలో ఉండడమే శుభప్రదం. లేనిపక్షంలో కాక్రోచ్ జనతా పార్టీలాంటివి మరిన్ని పుట్టే అవకాశాలున్నాయి.

నైతిక బాధ్యత అన్నది నేటి కాలంలో ఒక వినకూడని అపశబ్దంగా మారింది. బడ్జెట్ లీక్ అయినందుకు మొత్తం మంత్రివర్గంతో రాజీనామా చేయించిన ఎన్టీఆర్ వంటి

# 22ఏ భూముల నిబంధనలపై కొత్త జీవో:

మొదటి పేజీ తరువాయి

అమరావతి: నిషేధిత జాబితా (22ఏ) నుంచి భూములను తొలగించే నిబంధనలను సరళీకృతం చేస్తూ నేడు కొత్త జీవో తీసుకొస్తున్నామని ఏపీ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఆ జాబితాలో భూములు నమోదు చేసే నిబంధనలను కఠినతరం చేసినట్లు చెప్పారు. ఇకపై 22ఏ నిర్వహణ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ పరిధిలో ఉంటుందని చెప్పారు. గ్రామ కంఠం, పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చకూడదన్నారు. వ్యవసాయ భూములకు వెబ్‌ల్యాండ్ 2.0 ప్రామాణికంగా ఉంటుందని.. ఏవిధమైన మాన్యువల్ ఎంట్రీలు ఉండవని స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనగాని మాట్లాడారు. “18.06.1954 కంటే ముందు అసైన్ చేసిన అన్ని భూములు నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగిస్తున్నాం. కొత్త ఉత్తర్వులు జారీ అయిన 90రోజులలోపు సాఫ్ట్‌వేర్‌లో మార్పులను ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ (ఐజీఆర్ఎస్), సీసీఎల్ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) పూర్తిచేయాలి. తన భూమి ప్రభుత్వ భూమి కాదని నిరూపించుకోవాల్సిన బాధ్యత పౌరులు, భూ యజమానులపై ఉండదు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తుంది. ఏ కారణంగానైనా భూ యజమాని హక్కులకు భంగం కలిగితే దానికి సంబంధిత అధికారినే బాధ్యుడిగా భావించి తదుపరి చర్యలు తీసుకుంటాం. 22ఏ జాబితాలో పెట్టాలని ప్రతిపాదించిన ప్రతి ఫైల్‌కు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా పబ్లిక్ ఇన్‌క్లూజన్ రిజిస్టర్‌ను ఐజీఆర్ఎస్ నిర్వహిస్తుంది. ఏదైనా భూమి అన్యాక్రాంతం కాబోతోందనే సమాచారంతో ఎమర్జెన్సీగా 22ఏ జాబితాలో పెట్టాలంటే 60 రోజుల్లోపే ఆ ప్రక్రియను పూర్తిచేయాలి. ఆలోపు సంబంధిత పౌరుడికి 30 రోజుల గడువుతో నోటీసు ఇవ్వాలి. 60 రోజుల్లో ఎమర్జెన్సీ కేటగిరీ కింద 22ఏ జాబితాలో చేర్చకపోతే ఆ భూమి పట్టా భూమిగానే ఉంటుంది” అని అనగాని సత్యప్రసాద్ వివరించారు.

# మంగళగిరి కోసం బాబుతో గొడవ పడ్డా

మొదటి పేజీ తరువాయి

కొండవాలు ప్రాంతాలు, అటవీ భూములు, దేవాలయ భూముల్లో ఇల్లు నిర్మించుకొని దశాబ్దాలుగా ప్రజలు నివసిస్తున్నారు. దీంతో అర్హులైన పేద కుటుంబాలకు మంత్రి బట్టలు పెట్టి.. పసుపు, కుంకుమలతో పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి నిధుల కొరత ఉన్నా మంగళగిరిలో అభివృద్ధి ఆగట్లేదని తెలిపారు. మంగళగిరి అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబుతో కూడా గొడవ పెట్టుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ నిధులతో ఇబ్బంది ఉంటే సీఎస్సార్ నిధులు, వివిధ ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఎక్కడా ఎలాంటి ఆరోపణలు లేకుండా పారదర్శకంగా ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టామన్నారు. ఇచ్చిన హామీ మేరకు బొట్టు పెట్టి ఇళ్ల పట్టాలను అందజేస్తున్నట్లు చెప్పారు. దేశం మొత్తం నిడమర్రు పాఠశాల గురించి మాట్లాడుకోవడం గర్వంగా ఉందన్నారు. ఇంటి పట్టాలతో పాటు భూగర్భ డ్రైనేజీ, 100 పడకల ఆసుపత్రి, నీటి సమస్య.. ఇలా అన్నింటికీ రెండేళ్లలోనే పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. మంగళగిరి ప్రజలు ఓడించారనే కసితో ఇంకా బాగా పనిచేశానని చెప్పుకొచ్చారు. ప్రతిపక్షంలో ఉండగా 29 సంక్షేమ పథకాలను సొంత నిధులతో అమలు చేసి.. అధికారం ఇస్తే ఇంకెలా చేస్తానో అనే భరోసా కల్పించానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ఓట్లు తొలగించేవందెకు

# బిజెపి ఎత్తులు

మొదటి పేజీ తరువాయి

ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని గూడుపుఠాణి చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల వివరాలు ఎన్నికల అధికారులకు అందించాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉందన్నారు. ఈనెల 30లోగా నూటికి నూరు శాతం కొడంగల్ నియోజకవర్గంలో ప్రక్షాళన పూర్తి కావాలని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు కోల్పోవడానికి వీల్లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్‌కు నిరసన

మొదటి పేజీ తరువాయి

ప్రజా ఆందోళనలు పరిగణనలోకి తీసుకుని ధర్మేంద్ర ప్రదాన్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రాలు అమ్ముకున్న వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ధర్మేంద్రప్రదాన్ చెలగాటం ఆడారు. ఆయన రాజీనామా చేయాలని దిల్లీలో యువత ఆందోళన చేపట్టింది. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజా సమస్యల్ని ప్రస్తావించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. 20వ తేదీ నుంచి ప్రారంభమైన పార్లమెంట్ ఉభయసభల్లో.. ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి అడిగినా ప్రభుత్వం అనుమతించడం లేదు. లోక్‌సభ స్పీకర్ అంగీకరించడం లేదు. ప్రజాస్వామ్యానికి ఇది దురదృష్టకరమైన పరిస్థితి. దిల్లీ పోలీసులు రాహుల్‌గాంధీని కొడితే ఆయన ముక్కులో నుంచి రక్తం కారింది. ఈ దేశం కోసం రక్తం చిందించడంలో రాహుల్ గాంధీ మొదటివారు కాదు.. చివరివారూ కాదు. ఆనాడు మహాత్మాగాంధీ తెల్లదొరలతో కొట్లాడి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు. గాంధీజీని పొట్టన పెట్టుకున్న గాడ్సే వారసులు మీరు అంటూ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు.అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు. ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడంలేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని చెప్పుకొచ్చారు. పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకున్నారని.. రాహుల్ గాంధీపై పాశవిక దాడితో ఆయన రక్తం నేలకు చిందిందన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని.. మంత్రి పదవి కూడా చేపట్టలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడి విద్యార్థుల ప్రాణాలు బలిగొందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని.. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. అఃఈుఇలో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారని అన్నారు. లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని.. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

తొలుత రేవంత్‌రెడ్డి నివాసం నుంచి కొడంగల్‌లోని అంబేద్కర్ కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్థానిక నేతలు భారీ ఎత్తున పాల్గొన్నారు. బిజెపికి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

మొదటి పేజీ తరువాయి

గత 10 ఏళ్లల్లో 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక్క కేసులో కూడా దోషులు ఎవరో తేలలేదని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా రాహెల్ గాంధీ బుధవారం ఏర్పాటు చేసిన పత్రికాసమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్థంగా, అవినీతిమయంగా ఉందని ఆరోపించారు. ఆయన రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన రాజీనామాకు విద్యార్థులు పట్టుబడుతున్నారని, ఇది సరైన డిమాండేనని వ్యాఖ్యానించారు. ఈ దుస్థితికి ప్రతిబింబంగా మారిన ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. గత పదేళ్లల్లో సుమారు 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయి. అంటే.. సగటున వారానికి ఒక పేపర్ లీక్ జరిగింది. కోట్ల మంది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. కానీ ఒక్క కేసులో కూడా దోషులెవరో తేలలేదు. ఇలా ఎందుకు జరిగిందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకప్పుడు దేశానికి సంపదగా ఉన్న విద్యారంగం ఎన్డీయే పాలనలో ధ్వంసమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు విద్య భారంగా మారిందని చెప్పారు. కోచింగ్‌పై నీట్ అభ్యర్థుల వార్షిక ఖర్చు రూ.1.32 లక్షల కోట్లని అన్నారు. ఇది విద్యారంగం వార్షిక బడ్జెట్ రూ.1.42 లక్షల కోట్లకు దాదాపు సమానమని వ్యాఖ్యానించారు. సంపన్నుల కోసమే ఉద్దేశించిన ఈ వ్యవస్థలో పేదలకు స్థానం లేదని అన్నారు. సోమవారం నిరసనల సందర్భంగా విద్యార్థులపై లాఠీ చార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందేనని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థుల విషయంలో ఏం జరుగుతోంది. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని యువత కోరుతోంది. కానీ, ఈ ప్రభుత్వం శాంతియుతంగా నిరసనలు చేస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయించింది. మధ్యతరగతి కుటుంబాలకు చదువు ఆర్థిక భారంగా మారింది. విద్యపై రూ.1.4లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్రం చెబుతోంది. కానీ, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి. దీని వల్ల 7.50కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారు. విద్యార్థులు ఎంత బాధపడుతున్నా.. ఈ ప్రభుత్వం లెక్కచేయట్లేదు. ఈ పేపర్ లీకేజీ ఘటనల్లో ఇప్పటివరకు శిక్షపడిన నేరస్థుల సంఖ్య సున్నా అని రాహుల్ విమర్శించారు. దేశ యువతకు ఉద్యోగాలు లేవు. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. మన దేశంలో చైనా వస్తువుల సంఖ్య పెరిగింది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. బ్యాంకులను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారు. ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు పోతున్నాయి. కేంద్రం విధానాల వల్ల పేదలు, విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యార్థులంటే మనకు శత్రువులు కాదు. ఈ దేశ భవిష్యత్తు అన్న విషయం కేంద్రం గుర్తుంచుకోవాలని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని యువత డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని యువత కోరుకుంటోంది. ఆందోళన చేస్తోన్న యువతపై దాడి చేసిన వారికి శిక్ష పడాలని కోరుతోంది. ఇక, ఈ వైఫల్యాలకు గానూ ప్రధాని క్షమాపణలు చెప్పాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల డిమాండ్లకు మేం పూర్తి మద్దతు ప్రకటించాం అని రాహుల్ వెల్లడించారు. విద్యార్థుల ఆందోళనను మేం రాజకీయాలకు వాడుకోవట్లేదు. ప్రతిపక్ష నేతగా ప్రజల గళం వినిపించడం నా బాధ్యత. దీనిపై పార్లమెంట్‌లో మాట్లాడేందుకు కేంద్రం అవకాశం ఇవ్వట్లేదు. అందుకే విద్యార్థులకు మద్దతుగా వీధుల్లోకి వచ్చాం. నిన్న నిరసనల్లో నా పట్ల జరిగిన దానికి బాధపడటం లేదు. విద్యార్థులకు జరుగుతోన్న నష్టం విషయంలోనే బాధగా ఉంది. పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ప్రజల కోసం ఎన్ని దెబ్బలు తినేందుకైనా నేను సిద్ధం అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు

# విద్యార్థుల నిరసనలను రాజకీయాలకు వాడుకోవద్దు: నడ్డా

మొదటి పేజీ తరువాయి

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రాజకీయం చేస్తున్నారని కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఆరోపించారు. నిందారోపణలకు దిగకుండా.. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు పార్లమెంటులో ఈ విషయంపై విస్తృత చర్చకు విపక్షాలు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. భాజపా కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన నడ్డా.. ఈ విషయాన్ని తమ ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. గతంలో యూపీఏ హయాంలోనూ పేపర్లు లీక్ అయ్యాయని.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనూ ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్నాయని అన్నారు.

అంతకుముందు.. దేశంలో విద్యావ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. గత పదేళ్లలో 152 పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయ్యాయని అన్నారు. కోట్లాది మంది విద్యార్థులు బాధపడుతున్నా.. ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఎవరిపైనా చర్యలు తీసుకోలేదన్నారు.

# పంచదార్ల కొండపై అక్రమ మైనింగ్..

మొదటి పేజీ తరువాయి

అమరావతి: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని పంచదార్ల కొండ రెవెన్యూ భూముల్లో అక్రమ మైనింగ్‌పై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంపై అనకాపల్లి జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఆయన మాట్లాడారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఇచ్చిన ప్రాథమిక నివేదికను పరిశీలించి.. తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. మైనింగ్ అనుమతులు పొందిన సంస్థ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్నందున జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని పవన్ స్పష్టం చేశారు.

పంచదార్ల కొండ దిగువన ఉన్న శ్రీఉమా ధర్మలింగేశ్వర స్వామి వారి ఆలయం, సహజ జలధారల ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంరక్షణ చర్యలు చేపట్టాలని పవన్ సూచించారు. జలధారల రంగు మార్పుపై జాతీయ జలవిజ్ఞాన సంస్థ (చీ×ఱ) శాస్త్రవేత్తలను ఆహ్వానించాలన్నారు. జలధారల మూలాలను పరిశీలించి, సహజ ప్రవాహ సంరక్షణకు సంబంధించిన శాస్త్రీయ నివేదికలు తీసుకోవాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థపై జరిమానాతోపాటు పర్యావరణ పునరుద్ధరణ బాధ్యత కూడా వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచదార్ల కొండ పరిసరాలను నో మైనింగ్ జోన్‌గా ప్రకటించాలని రెవెన్యూ, మైనింగ్ శాఖలకు పవన్ సూచించారు. ఆ మైనింగ్ సంస్థకు ఇచ్చిన పర్యావరణ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించారు.

# పనిచేస్తున్న సంస్థకే కన్నం..

## భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు




మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు వివరాలను ఆయన వెల్లడించారు. “ఓ జ్యువెలరీ సంస్థలో హరీశ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. కంపెనీ లాకర్‌లో ఉన్న బంగారు ఆభరణాలపై నిందితుడు ముందే నిఘా పెట్టాడు. ఈనెల 16న చోరీకి యత్నించి విఫలమయ్యాడు. 17న విద్యుత్ సరఫరా నిలిపివేసి బాత్రూమ్ గ్రిల్స్ తొలగించి లోపలికి ప్రవేశించాడు. లాకర్‌లోని బంగారు ఆభరణాలను అపహరించాడు. దొంగిలించిన బంగారాన్ని సోదరుడు ఆకాశ్ వద్ద దాచిపెట్టాడు. నిందితులను అరెస్ట్ చేసి కిలోకు పైగా (1,028 గ్రాములు) బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నాం” అని డీసీపీ తెలిపారు.

# కరీంనగర్ లో భర్త కోసం భార్య పోరాటం

**- ఇంటి ముందు చిన్నారి పాపతో కలిసి బైఠాయింపు..!**
**- రెండో పెళ్లి చేసుకుని అన్యాయం చేశాడంటూ కన్నీరు.. న్యాయం చేయాలని డిమాండ్**

కరీంనగర్ /ప్రజాదివాస్ జూలై 22

మాయమాటలతో తనను నమ్మించి,జీవితాంతం తోడుంటానని ప్రమాణం చేసిన భర్త.. మరో మహిళ మోజులో పడి తనను,తన కన్న బిడ్డను రోడ్డున పడేశాడంటూ కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్కేపల్లి గ్రామానికి చెందిన ఈరాల మేఘన రోదిస్తూ తన భర్త ఇంటి ఎదుట బైఠాయించి మంగళవారం ధర్నాకు దిగిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతుంది.వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నాగసముద్రాల గ్రామానికి చెందిన మేఘనను సైదాపూర్ మండలం వెన్కేపల్లికి చెందిన ఈరాల రాజు అనే వ్యక్తితో 2022లో ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో కట్న కానుకలతో వివాహం జరిపించారు.వీరికి ఒక చిన్నారి కూతురు క్రిత్యశ్రీ(3) జన్మించింది.పెళ్లికి ముందే రాజు మరో యువతితో ప్రేమాయణం నడిపించాడని,ఇదంతా తెలిసి తనతో పెళ్లి చేయించి తనను,తన కుటుంబాన్ని నానా ఇబ్బందులు పెడుతున్నారని మేఘన రోధించారు.భర్త ప్రవర్తనలో మార్పును గమనించి భర్తను నిలదీయాగ భార్యాపిల్లలను నిర్లక్ష్యం చేస్తూ, మానసికంగా, శారీరకంగా వేధించడం ప్రారంభించారని తెలిపారు.ఈ క్రమంలోనే సదరు భర్త..భార్యకు తెలియకుండా రహస్యంగా మరో మహిళను వివాహం చేసుకున్నాడని బాధితురాలు ఆరోపిస్తుంది.రెండో పెళ్లి చేసుకున్నప్పటి నుంచి తమను పూర్తిగా వదిలేసి హైదరాబాదులో రహస్యంగా జీవిస్తున్నారని, విషయం తెలిసి తన తండ్రి గుండెపోటుతో మృతి చెందారని మేఘన కన్నీరుమున్నీరైంది.పంచాయతీలు పెట్టి ప్రజాప్రతినిధులు,కులపెద్దలు చెప్పినా తన భర్త రాజు వినక పోవడంతో.. విసిగిపోయిన బాధితురాలు తన చిన్నారి కూతురిని ఎత్తుకుని భర్త నివాసం ఉంటున్న ఇంటి ముందుకు చేరుకొని ధర్నాకు దిగారు. న్యాయం జరిగే



వరకు ఇక్కడి నుండి కదిలేది లేదంటూ తన కుటుంబ సభ్యులతో అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నారు.చిన్నారితో కలిసి తల్లి ఇంటి వద్ద ధర్నా చేయడం చూసి స్థానికులు అయ్యో పాపం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమకు న్యాయం చేయాల్సిన పోలీసులు తనపై, తమ కుటుంబ సభ్యులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు మండిపడుతున్నారు.ఇట్టి విషయమై బాధితురాలి భర్త రాజును వివరణ కోరగా తాను అందుబాటులో లేనని తాను ఎవరిని వివాహం చేసుకోలేదని,తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో కొవిడ్ కలకలం.. గడగడలాడిస్తున్న కొత్త వేరియంట్ లక్షణాలు!

హైదరాబాద్ /ప్రజాదివాస్ జూలై 22


దేశవ్యాప్తంగా కొవిడ్ కేసులు మళ్లీ నిశ్శబ్దంగా విజృంభిస్తుండటం తెలుగు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే నలుగురు కరోనా బారిన పడి ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అమరావతి ఆరోగ్య శాఖ వర్గాల సమాచారం ప్రకారం, ఏపీలో కొత్తగా మరో 7 కేసులు నమోదవడంతో మొత్తం కేసుల సంఖ్య 26కు చేరింది. గుంటూరు, తూర్పుగోదావరి, బాపట్ల జిల్లాల్లో ఈ కొత్త కేసులు వెలుగుచూశాయి. ప్రస్తుతం పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, మరికొందరు హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**హైదరాబాద్ ఆస్పత్రుల్లో రోగుల క్యూ..**

మరోవైపు తెలంగాణలోనూ పరిస్థితి ఏమాత్రం భిన్నంగా లేదు. గడిచిన నెల రోజులుగా హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు తీవ్రమైన జలుబు, ఒళ్లు నొప్పులు, పొడి దగ్గు, తీవ్ర జ్వరంతో వస్తున్న బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే, వీరికి వైద్యులు కేవలం సాధారణ ఇన్ఫెక్షన్లకే చికిత్స అందిస్తున్నారు తప్ప కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం లేదు. పరీక్షలు చేయకపోవడం వల్లే అధికారిక రికార్డుల్లో తెలంగాణలో కరోనా కేసులు 'సున్నా'గా కనిపిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల తార్నాకకు చెందిన ఒక మహిళ తీవ్ర శ్వాసకోశ సమస్యలతో మరణించడం, గాంధీ ఆస్పత్రిలో ఒక కేస్ వెలుగు చూడటం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

**కొరతలో ఆస్పత్రులు.. నిమ్మకు నీరెత్తిన ఆరోగ్య శాఖ**

×జవీ= నివేదికల ప్రకారం దేశంలో జూన్ నెల నుంచే కరోనా గ్రాఫ్ పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. అయినా సరే, రాష్ట్రంలో వ్యాధుల వ్యాప్తిని పర్యవేక్షించాల్సిన ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గత నాలుగేళ్లుగా ప్రభుత్వ ఆస్పత్రులకు టెస్టింగ్ కిట్లు, మాస్కులు, శానిటైజర్ల కొనుగోలు బంద్ చేయడంతో ప్రస్తుతం ఆస్పత్రుల్లో తీవ్ర కొరత వేధిస్తోంది. ఆరోగ్య శాఖ నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు లేదా హెచ్చరికలు రాకపోవడంతో క్షేత్రస్థాయిలో వైద్యులు కూడా కేవలం సాధారణ మందులతో సరిపెడుతున్నారు.




**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే!**

వాతావరణంలో మార్పులు, కొవిడ్ కొత్త సబ్‌వేరియంట్ల ప్రభావం వల్ల ఈ సమస్య తలెత్తుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, వృద్ధులు, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా తీవ్రమైన దగ్గు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించడం, చేతులను శుభ్రంగా ఉంచుకోవడం, జనసమ్మర్ధం ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండటం ద్వారా ఈ వైరస్ బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ దారుణం.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**- నీట్ లీకేజీలపై కాంగ్రెస్ నిరసన.. సిరిసిల్ల గాంధీ చౌక్‌లో హోరెత్తిన ఆందోళన**
**- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ.. సిరిసిల్ల కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన**

రాజన్న సిరిసిల్ల జిల్లా/ ప్రజాదివాస్ జూలై 22

రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని గాంధీ చౌక్‌లో బుధవారం శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనేతల అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఈ ఆందోళన చేపట్టారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. జంతర్ మంతర్ వద్ద




శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం, వారికి మద్దతు తెలిపిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆది శ్రీనివాస్ విమర్శించారు. నీట్ పరీక్షల లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిందని, ఈ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్రంలో బిఆర్ఎస్, నేడు దేశంలో బీజేపీ వరుస లీకేజీలతో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయని మండిపడ్డారు.గత 12 ఏళ్ల బీజేపీ పాలనలో పేదలకు ఉపయోగపడే ఒక్క సంక్షేమ పథకం కూడా తీసుకురాలేదని, పైగా ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నా ప్రధాని మోడీ, అమిత్ షాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ఒంటెద్దు పోకడలకు పోతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విద్యార్థులకు, యువతకు అండగా ఉంటుందని, రానున్న రోజుల్లో ప్రజలు బీజేపీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చల్మెడ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ జన్మదిన వేడుకలు

కోనరావుపేట మండలం/ ప్రజాదివాస్ జూలై 22



సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వినోద్ కుమార్‌కు చల్మెడ, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన నాయకుడు బోయినపల్లి వినోద్ కుమార్ ప్రజాసేవలో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దీవెనలు వారిపై ఉండి, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు వారు బాగుండాలని వేములవాడ రాజన్నను వేడుకుంటున్నానన్నారు...

# బురదమయమైన బావుసాయిపేట పాఠశాల దారికి విముక్తి.. సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా కృషి

**- విద్యార్థుల ఇబ్బందులపై తక్షణ స్పందన: హైస్కూల్ బాటను చదును చేయించిన సర్పంచ్**

కోనరావుపేట మండలం/ ప్రజాదివాస్ జూలై 22





ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం తీవ్రంగా దెబ్బతింది. వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు నడిచే ప్రధాన దారితో పాటు, టాయిలెట్లు/వాష్‌రూమ్‌లకు వెళ్లే త్రోవ అంతా పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా చిన్న పిల్లలు జారిపడే ప్రమాదం ఏర్పడటంతో ఆందోళన వ్యక్తమైంది.ఈ సమస్యపై సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా తక్షణమే స్పందించారు. విద్యార్థుల ఇబ్బందులను తన సొంత కుటుంబ సమస్యగా భావించి, వారి భద్రత మరియు సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే రంగంలోకి దిగారు. పాఠశాల ప్రాంగణంలోకి భారీ వాహనాల ద్వారా మట్టిని తెప్పించి, ప్రధాన దారితో పాటు టాయిలెట్లకు వెళ్లే త్రోవపై పోయించి చదును చేయించారు.ఒక మహిళా సర్పంచ్‌గా గ్రామంలోని ప్రతి విద్యార్థికి సురక్షితమైన వాతావరణం కల్పించడమే తమ ప్రధాన బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. బడికి వచ్చే పిల్లలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా విద్యను అభ్యసించాలనే సేవా సంకల్పంతో గ్రామ సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. సమయానికి స్పందించి సమస్యను తీర్చిన సర్పంచ్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# భర్త మృతితో మనస్తాపం.. బావిలో పడి వృద్ధురాలి ఆత్మహత్య

కోనరావుపేట మండలం/ ప్రజాదివాస్ జూలై 22



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. భర్త మరణంతో తీవ్ర ఒంటరితనానికి గురైన ఓ వృద్ధురాలు బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వట్టిమల్ల గ్రామానికి చెందిన లక్కం మణెమ్మ (70) భర్త నరసయ్య ఏడాది క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె తీవ్ర మనోవేదన, ఒంటరితనంతో బాధపడుతూ కుటుంబ సభ్యుల వద్ద తరచూ చనిపోతానని చెబుతుండేది.ఈ నేపథ్యంలో మంగళవారం (జూలై 21) రాత్రి ఇంటి సమీపంలో ఉన్న పాలకుర్తి నారాయణకు చెందిన చేదబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.మృతురాలి పెద్ద కుమారుడు లక్కం రమేష్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోనరావుపేట ఎస్ఐ కే. ప్రశాంత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భూముల రీ సర్వే కచ్చితత్వంతో చేయాలి

- వివరాలు పక్కాగా నమోదు చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరిలో భూ భారతి కింద భూముల రీ సర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

వేములవాడ, జూలై -22 ప్రజా దివాస్





భూ భారతి కింద భూముల రీ సర్వే కచ్చితత్వంతో చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరిలో భూ భారతి కింద రోవర్ యంత్రంతో భూముల రీ సర్వే పనులు కొనసాగుతుండగా, బుధవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే యంత్రంతో వివరాలు ఎలా తీసుకుంటారో పరిశీలించి.. అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో భూ భారతి కింద భూముల రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో సర్వే పై రైతులకు ముందుగా సమాచారం అందించాలని సూచించారు. భూముల వివరాలను పూర్తి కచ్చితత్వంతో నమోదు చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శి ఇతర అధికారులు సమన్వయంతో పనులు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఏడీ సర్వే శ్రీనివాస్, తహసీల్దార్ జయంత్ అధికారులు సిబ్బంది ఉన్నారు.

# 49.50 లక్షలతో డంపింగ్ యార్డు సీసీ రోడ్డుకు భూమిపూజ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ /ప్రజాదివాస్ జూలై 22

వేములవాడ పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. వేములవాడ పట్టణ పరిశుభ్రతకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా బుధవారం రూ.49.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న డంపింగ్ యార్డుకు వెళ్లే మార్గానికి అప్రోచ్ సీసీ రోడ్డు నిర్మాణానికి,టాయిలెట్ బ్లాక్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే విధానాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. చెత్త నిర్వహణను శాస్త్రీయ పద్ధతిలో అమలు చేయడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణంతో పాటు ప్రజారోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. డంపింగ్ యార్డుకు వెళ్లే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని విప్ పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్ల విస్తరణ, మురుగునీరు మూలవాగు, గుడి చెరువులోకి చేరకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఇప్పటికే సుమారు 45 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు.దాదాపు 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు విస్తరణ, నాలుగు లైన్ల మూడో వంతెన నిర్మాణం తుది దశకు చేరుకుందని, భూసేకరణకు రూ.6.90 కోట్లకు పైగా వ్యయం చేశామని వెల్లడించారు. ఆలయ అభివృద్ధితో పాటు పట్టణ మౌలిక వసతులను కూడా సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.సామాజిక భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ ఎస్టీ భవన్, బీసీ భవన్, అంబేడ్కర్ భవన్, క్రిస్టియన్ భవన్, షాదీఖానా తదితర భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పేదల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ, సన్నబియ్యం, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని







పేర్కొన్నారు.వేములవాడ పట్టణాభివృద్ధి, రాజన్న ఆలయాభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఆలయ అభివృద్ధి పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలు, పర్యాటక రంగం మరింత విస్తరించనున్నాయని అన్నారు. ప్రజల సహకారంతో వేములవాడను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, పట్టణ కౌన్సిలర్లు, పట్టణ అర్బన్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకోవాలి

- ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- చందుర్తి మండలం మల్యాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్





చందుర్తి, జూలై -22 ప్రజా దివస్

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.
చందుర్తి మండలం మల్యాల గ్రామంలో పులి పద్మ,పీసరి శిరీష కు సంబంధించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులు ఎప్పుడు మొదలు పెట్టారు? ఫోటోలు ఆన్లైన్లో అప్ లోడ్ చేస్తున్నారా? రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం అందుతుందా అని ఆరా తీశారు. ఎప్పటిలోగా ఇండ్లు పూర్తి చేస్తారో అడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకొని.. తమ సొంత ఇంటి కల సాకారం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు అధికారులు అందుబాటులో ఉండి.. లబ్ధిదారుల ఇబ్బందులు దూరం చేయాలని ఆదేశించారు. బోర్ వెల్ రీచార్జ్ పనులకు శ్రీకారం చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద బోర్ వెల్ రీచార్జ్ పనులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శ్రీకారం చుట్టారు. బోర్ వెల్ రీచార్జ్ పనుల విస్తీర్ణం, దానిలో ఏ ఏ మెటీరియల్ ఎంత వేయాలి? తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో తెలంగాణ జలసిరి కింద నీటి సంరక్షణ పనులు ముమ్మరంగా చేయించాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీకి నిర్ణయించిన లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం పనులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, తహసీల్దార్ భూపతి, ఎంపీడీఓ రాధ సర్పంచ్ శారద తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళిక ప్రకారం నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- చందుర్తి మండలం మూడపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పరిశీలన



చందుర్తి, జూలై -22 ప్రజా దివస్

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. చందుర్తి మండలం మూడపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ మ్యాప్ పరిశీలించి..ఏ ఏ నిర్మాణాలు ఎక్కడ చేస్తారో అడిగి తెలుసుకున్నారు. ఎప్పటిలోగా పూర్తి అవుతుందని ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కూలీల సంఖ్యను పెంచి.. పనుల్లో వేగం పెంచాలని సూచించారు. మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ మూడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం ఆవరణ లో వన మహోత్సవం కింద జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మొక్కలు నాటారు. ఏ ఏ మొక్కలు.. ఎన్ని నాటుతున్నారు? అని ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. మహోత్సవం కింద లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని, ప్రతి మొక్కను సంరక్షించాలని పిలుపు నిచ్చారు. ప్రతి ప్రభుత్వ శాఖ తమ లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, తహసిల్దార్ భూపతి, ఎంపీడీఓ రాధ, సర్పంచ్ మల్లీశ్వరి, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి, స్వల్పకాలిక పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి: వ్యవసాయ అధికారిణి వినీత

- ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 22

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి, జయవరం, ఫాజిల్‌నగర్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, నీటి వనరులు క్రమంగా క్షీణిస్తున్న నేపథ్యంలో రైతులు నీటిని పొదుపుగా వినియోగిస్తూ పంటల సాగు చేపట్టాలని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా రూరల్ మండల వ్యవసాయ అధికారిణి వినీత మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా కంది, రాగి, జొన్న, ఆముదం,









ప్రొద్దుతిరుగుడు వంటి పంటలు తక్కువ నీటితో పాటు తక్కువ పెట్టుబడితో సాగు చేయవచ్చని, మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు.ఎంపీడీఓ కె. శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఏఈ సాయి కుమార్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో బోర్లు, చెరువుల్లో నీటి లభ్యత మరింత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. నీటి యాజమాన్యాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి చుక్క నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వ్యవసాయ విస్తరణ అధికారులు అనూష, మసూద్ రైతులకు పంటల ఎంపిక, నీటి పొదుపు పద్ధతులు, పెట్టుబడి వ్యయం తగ్గించే మార్గాలపై అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపడితే నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని వివరించారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కీ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

- విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అరెస్టులతో గొంతు నొక్కాలని చూడటం దుర్మార్గం
- "చలో లోక్ భవన్" కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి

జూలై 22 ప్రజా దివాస్

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ పై కేంద్ర ప్రభుత్వంను ప్రశ్నించిన విద్యార్థులను పోలీసులతో అణచివేయడం అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ అన్నారు. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన "చలో లోక్ భవన్" కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదివి పరీక్షలు రాస్తుంటే, కొందరు అక్రమాలకు పాల్పడి వారి కలలను అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. నీట్ మాత్రమే కాదు, వరుసగా జరుగుతున్న పోటీ పరీక్షల లీకులు దేశ యువతలో ప్రభుత్వంపై, పరీక్షల నిర్వహణపై తీవ్ర అనుమానాలు కలిగించాయని పేర్కొన్నారు. విద్యార్థులు అడుగుతున్న ప్రశ్న ఒక్కటేనని, "మా శ్రమకు విలువ లేదా" అనే వారి ఆవేదనకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ సమాధానం చెప్పలేకపోయిందన్నారు. సమస్యకు పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం, ప్రశ్నించిన వారిపై పోలీసులు ప్రయోగించడం ద్వారా తన వైఫల్యాన్ని దాచిపెట్టాలని చూస్తోందని విమర్శించారు. విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో పాటు కాంగ్రెస్, ఇండియా కూటమి నాయకులపై కూడా దాడి చేయడం వారిని అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య చరిత్రలో మరో విచారకర పరిణామమన్నారు. దాడులతో యువతను, ప్రశ్నించే వారిని ఆపలేరని, ప్రజాస్వామ్యంలో విభేదించే స్వరాలను బలప్రయోగంతో అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి స్పష్టం చేశారు. నీట్ కుంభకోణానికి నైతిక బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదేనని, అందుకు కేంద్ర విద్యాశాఖ




మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. బాధ్యత వహించాల్సిన వారు పదవుల్లో కొనసాగుతూ, న్యాయం కోరుతున్న విద్యార్థులను, వారికి మద్దతు తెలిపిన నాయకులను దాడులతో అణిచివేయడం, అరెస్టులు చేయడం దేశ ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. దేశ యువత విశ్వాసాన్ని తిరిగి నిలబెట్టాలంటే నీట్ పేపర్ లీక్‌తో పాటు అన్ని పోటీ పరీక్షల అక్రమాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని ఆయన కోరారు. పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సాంకేతిక, పరిపాలనా సంస్కరణలు తీసుకువచ్చి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం యువతే సమాజానికి మార్గదర్శకులు: జిల్లా ఎస్పీ డి.జానకి,

జూలై 22 ప్రజా దివాస్

తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఎస్వీఎస్ డెంటల్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా ఎస్వీఎస్ డెంటల్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, హాజరై విద్యార్థులను ఉద్దేశించి అవగాహన సందేశాన్ని అందించారు.

ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో పాటు ప్రత్యేక అవగాహన వీడియోలను ప్రదర్శిస్తూ మాదకద్రవ్యాల బారిన పడిన వ్యక్తుల జీవితాలు ఎలా నాశనమవుతాయో, కుటుంబాలు, స్నేహితులు, సమాజంపై వాటి ప్రభావం ఎలా ఉంటుందో విద్యార్థులకు వివరించారు. అనంతరం జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ యువత తమ భవిష్యత్తును నిర్మించుకునే కీలక దశలో మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం కారణంగా వ్యక్తి తన ఆరోగ్యం, కుటుంబం, స్నేహితులు, విద్య, ఉపాధి అవకాశాలు, సమాజంలో గౌరవం




వంటి అమూల్యమైన అంశాలను కోల్పోతాడని తెలిపారు. ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడే బాధ్యతను స్వీకరించి, మరొకరికి కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఎవరైనా మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా లేదా రవాణా చేస్తున్నా వెంటనే 1908 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారిని శిక్షించడం కాకుండా, అవసరమైతే డి-అడిక్షన్ సెంటర్లకు పంపించి తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. అలాగే జూన్ 26, 2026న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని




తెలంగాణ ఈగల్ ఫోర్స్ వారు నిర్వహించిన పోటీలలో పాల్గొన్న కళాశాల విద్యార్థిని విద్యార్థులకు జిల్లా ఎస్పీ గారి చేతుల మీదుగా విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మరియు బ్రోన్జ్ మెడల్ అందజేయడమే కాకుండా ఈ పోటీలలో పాల్గొన్న మిగతా విద్యార్థినీ విద్యార్థులకు తెలంగాణ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ శ్రీ సందీప్ శాండిల్య అప్రసియేషన్ లెటర్ మరియు యాంటీ డ్రగ్ సోల్జర్స్ సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ ఈగల్ ఫోర్స్ డీఎస్పీ ఎన్.బుచ్చయ్య, ఎస్వీఎస్ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, ప్రిన్సిపల్ దామోదర్ రెడ్డి, అధ్యాపకులు, రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, ఈగల్ ఫోర్స్ సభ్యులు మరియు సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ కేబుల్ చోరీ కేసు ఛేదన.. నలుగురు నిందితుల అరెస్ట్..

జూలై 22 ప్రజా దివాస్

కామారెడ్డి జిల్లా రామారెడ్డి పోలీసుల చాకచక్యంతో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌లో కేబుల్ వైర్ల చోరీకి పాల్పడిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, చోరీకి గురైన కేబుల్ వైర్ బండిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కామారెడ్డి సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయం బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. పోలీసుల వివరాల ప్రకారం, రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డిపేట గ్రామ సమీపంలో స్వయంభూశ్వరి ఆలయం వద్ద ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌లో ఈ నెల 18న గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్ వైర్లను చోరీ చేశారు. ఈ ఘటనపై బీఎస్ఎన్ఎల్ జూనియర్ టెలికాం అధికారి నల్లవెల్లి శ్రీధర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు క్రైమ్ నెం.156/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా బుధవారం జగదాంబ తండా జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న టాటా ఏస్ వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా అందులో ఉన్న వ్యక్తులు పారిపోవడానికి యత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, రెడ్డిపేట సమీపంలోని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌లో కేబుల్ వైర్లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. అరెస్టు చేసిన నిందితుల్లో పుప్పాల కిరణ్ కుమార్ (ఇసాయిపేట్,రామారెడ్డి)తో పాటు కల్లెం సతీష్, పార్టం గాబ్రియల్, గంగారాం ఉన్నారు. వీరిలో ముగ్గురు నిందితులు మెదక్ జిల్లాకు చెందిన వారని పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి చోరీకి గురైన కేబుల్ వైర్ బండిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానం ముందు




హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్తుల దొంగతనాలు, విధ్వంసక చర్యలు లేదా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని రామారెడ్డి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ మెళకువలను వివరించాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్





చందుర్తి, జూలై -22 ప్రజా దివస్

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు క్షేత్ర స్థాయిలో మెళకువలను వివరించి, తక్కువ నీటితో సాగు అయ్యే ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు సూచించారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో బుధవారం పాల్గొన్న అనంతరం అక్కడికి వచ్చిన జిల్లెల్ల లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ శ్వవిద్యాలయం విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తాము చదువుకున్న శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను, మెళకువలను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. పుస్తకాల్లో నేర్చుకున్న విషయాలను కేవలం తరగతి గదులకే పరిమితం చేయకుండా, గ్రామాల్లో రైతులను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవాలని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పరిష్కారాలను సూచించాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రయోజనాలను, సాగు పద్ధతులను రైతులకు వివరించాలని అన్నారు.

విత్తనాలను ఎప్పుడు విత్తాలి, తక్కువ నీటిని సమర్థవంతంగా ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలను రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక గ్రామాన్ని లేదా కొంతమంది రైతులను ఎంపిక చేసుకుని అవగాహన కల్పించాలను కలెక్టర్ పేర్కొన్నారు.

# GO 25 ను వెంటనే సవరించాలి: టీఎస్ యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్

వీర్నపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల నిరసన

వీర్నపల్లి జూలై 22 ప్రజా దివాస్

ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, అందుకోసం



ప్రభుత్వం జీవో నెంబర్ 25 ను వెంటనే సవరించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి సీహెచ్. రాజశేఖర్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా, మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీహెచ్. రాజశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు 20 లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు,21 నుండి 40 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు,41 నుండి 60 మంది విద్యార్థులకు ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు,60 దాటిన విద్యార్థులకు ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయునితో పాటు ప్రత్యేక ప్రధానోపాధ్యాయుడు 80 కి పైగా విద్యార్థులు ఉన్నచోట తరగతికి ఒక టీచర్‌తో పాటు ప్రధానోపాధ్యాయుడు మరియు వ్యాయామ ఉపాధ్యాయుడు ని నియమించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో వెంటనే నూతన ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలి. పాఠశాలల్లో అవసరమైన చోట విద్యా వాలంటీర్లను తక్షణమే నియమించాలనీ పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో టి ఎస్ యు టి ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, ఉపాధ్యాయులు గజన్, అనిత, కావేరి, సంగీత, మనోజ్, అనిల్ మరియు శిక్షణలో పాల్గొంటున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య సలహాదారులుగా బేగరి సంగమేశ్వర్ ఏకగ్రీవ ఎన్నిక..


జూలై 22 ప్రజా దివాస్



తెలుగు జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య సలహాదారులు గా సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం వట్టిపల్లి మండల్ మరవెల్లి గ్రామానికి చెందిన బేగారీ సంగమేశ్వర్ ను ( టి జే డబ్ల్యు ఏ ) జాతీయ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సంగమేశ్వర్ మాట్లాడుతూ మండల స్థాయి నుండి మొదలుకొని జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి వరకు తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను నమ్మకంతో నిర్వహిస్తానని తెలియజేశారు తాను తనపై నమ్మకంతో జాతీయ కమిటీ రాష్ట్ర ముఖ్య సలహాదారులుగా నియమించినందుకు జాతీయ కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు

# సాహిత్య సింహాసనం దాశరథి! మంత్రి దామోదరరాజనర్సింహ

జూలై 22 ప్రజా దివాస్




నా తెలంగాణ వెండితెరల సాహిత్య సింహాసనం, కోటి రత్నాల వీణలా మిన్నమిన్నలుతూనే ఉంది ఆ గాత్రంలో బలముంది, ఆ పద్యంలో ప్రాణముంది. నిజాం పాశంలో ఊపిరాడని కాలంలో, నిప్పులాంటి గళంతో నిలదీసిన నిపుణుడు – ప్రజాకవి దాశరథి! "ఓ నిజం పిశాచమా" అంటూ బీద ప్రజల బాధను బాసగా బలంగా పలికిన యోధుడు. మీలాంటి రాజులు మాకు అక్కర్లేదు అన్న స్వరంలో, బానిసత్వాన్ని చీల్చిన మాటల తూటాలు. "నా గీతావళి ఎంత దూరం ప్రయాణంబోను"అంటూ తన కలం దారి చూపించింది ఆధునిక ఉద్యమాలకి, ప్రజాస్వామ్య పోరాటాలకి. ఆయన రచనలు మన్నించని నిప్పుల వానలూ, ఆయన భావాలు ఆగని గాలివానలూ, ఈ భూగోళాన్నే అగ్గిపెట్టే విధంగా లిఖించబడినవి శబ్ద తపస్సులో తేజస్సుగా మండినవే. జయంతోత్సవ రోజున తెలుగు తల్లి ఒడిలో మరోసారి పలికిన గర్వ గీతం దాశరథి పురస్కారం, దాశరథికి వందనం, మన వాక్యాల శక్తికి సాక్షాత్కార వేదం! దాశరథి కృష్ణమాచార్య జయంతోత్సవ శుభాకాంక్షలు. సిలారపు దామోదర రాజనర్సింహ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వర్యులు,

# వేములవాడ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న అమరావతి జడ్జి లిఖిత

- భీమేశ్వర స్వామి ఆలయంలో అమరావతి జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యేక పూజలు



వేములవాడ/ప్రజాదివాస్ జూలై 22

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అమరావతి జూనియర్ సివిల్ జడ్జి లిఖిత కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు వేద పండితులు, అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భీమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఆమెకు, కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం చేసి, శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ప్రోటోకాల్ పర్యవేక్షకులు పెరుక శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

# కోహిర్ మండల, పట్టణ బి.ఎల్.ఏ.లతో నామమాత్రపు ఓటర్ల విశేష సవరణపై డా॥ ఏ. చంద్రశేఖర్ సమీక్షా సమావేశం

జూలై 22 ప్రజా దివాస్

కోహిర్ పట్టణంలోని భారత్ కల్యాణ మండపంలో కోహిర్ మండల మరియు పట్టణ బూత్ స్థాయి ఏజెంట్లతో (బి.ఎల్.ఏ.) నామమాత్రపు ఓటర్ల విశేష సవరణ ప్రక్రియపై విశేష సమీక్షా సమావేశం నిర్వహించబడింది. పూర్వ మంత్రివర్యులు, జహీరాబాద్ బాధ్యులు డాక్టర్ ఏ. చంద్రశేఖర్ నాయకత్వంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సమావేశంలో ఓటర్ల విశేష సవరణ ప్రక్రియ పురోగతి, నూతన ఓటర్ల నమోదు, వివరాల గణన పత్రాల భర్తీ, పౌరులలో అవగాహన పెంపొందించడం, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం వంటి కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ. చంద్రశేఖర్ మాట్లాడుతూ:"ప్రతి అర్హుడైన పౌరుడు తన వివరాలను క్రమపద్ధతిలో నమోదు చేసుకోవడం



ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసే ప్రాథమిక బాధ్యత. నాయకులు, సమన్వయకర్తలు, బూత్ స్థాయి ఏజెంట్లు మరియు కార్యకర్తలు ఇంటింటికీ వెళ్ళి ఓటర్ల సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి. అర్హులైన ఏ ఒక్కరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా జాగ్రత్త వహించాలి." ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సహాయం అందిస్తూ, సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ప్రజ భాగస్వామ్యంతో జహీరాబాద్ నియోజకవర్గంలో ఈ ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని పూర్ణోత్సాహంతో విజయవంతం చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రామలింగారెడ్డి ఆత్మ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ నియోజకవర్గ సమన్వయకర్త అశోక్ కుమార్ కోహిర్ పురపాలక సంఘ అధ్యక్షులు హన్నన్ జావీద్ పురపాలక సంఘ ఉపాధ్యక్షులు సువర్ణ-మల్లన్న పాటిల్ కోహిర్ మండల అధ్యక్షులు ముజాఫ్ఫార్ హుస్సేన్ పట్టణ అధ్యక్షులు అర్షద్ అలీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంషీర్ అలీ పూర్వ పట్టణ అధ్యక్షులు అస్మా తబస్సుమ్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఈ కార్యక్రమంలో స్థానిక మండలి సభ్యులు, గ్రామ సర్పంచులు, బూత్ స్థాయి ఏజెంట్లు, కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# జహీరాబాద్ మున్సిపాలిటీ ఏరియాలో వర్షం కురిస్తే చాలు ప్రజల ప్రాణాలు అరచేతిలోనే

- డ్రైనేజ్ నీరు రోడ్డుపైనే మురికి నీరు రోడ్డుపైనే వర్షం నీరు రోడ్డుపైనై మరి మోరీలు ఎక్కడ
- 37వ వార్డు కౌన్సిలర్ పెద్దబయి మైపాల్ మరియు టీవైజే ఎఫ్ నియోజకవర్గ జనరల్ సెక్రటరీ మొహమ్మద్ ఇమ్రాన్





జూలై 22 ప్రజా దివాస్

ప్రధాన రహదారులపై గుంతలు అరగజం పాటు లోతుకు ఉన్నప్పటికీ రోడ్డుపైన వర్షం నీరు చేరుకోవడంతో గుంతలు ఎక్కడున్నాయో ఎర్రటి నీటిలో తెలవక టూవీలర్ ప్రయాణదారుల ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు ప్రధానంగా జహీరాబాద్ నుండి తాండూర్ వెళ్లే రహదారి ప్రధానంగా మనం చూసుకుంటే బాగా రెడ్డి ఫ్లైఓవర్ నుండి రాంనగర్ మరియు మల్చల్మ గ్రామం వరకు రోడ్డు మొత్తం పాడైనప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా కనీసం మరమ్మత్తులు చేయాలన్న ఆలోచనలు లేరు డాంబర్ రోడ్ మొత్తం గుంతలతో పాడైన ఇస్తే ఆ గుంతలలో సేడే మన్నును తెచ్చి నింపుతున్నారు ఆ సేయడం అన్న కాస్త నీటిలో నాని బురదగా మారడమే కాకుండా ప్రయాణించే ప్రయాణకుల వాహన టైర్లకు గ్రిప్ ఇవ్వకుండా బండ్లు జారీ ప్రజలు బొక్క బోర్లా పడుతున్నారు ఇంత జరుగుతున్న అధికారులు గానీ నియోజకవర్గ ఎమ్మెల్యే పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ గాని మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ కమిషనర్ గాని రోడ్డు నిర్మాణ శాఖ అధికారులు గానీ చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు చెప్పుకోవడానికే వంద ఫీట్ల రోడ్డు రెండు వైపులా కాల్వల్ల నిర్మాణం లేక ఫ్లై ఓవర్ పక్కన ఉన్న ఉష్కా అడ్డ దగ్గర రోడ్డు ఎంత దంసంగా అయిందో మీకు అందరికీ తెలుసు వందల టన్నుల కొద్ది లారీల బరువుకు రోడ్డు మొత్తము పెద్ద పెద్ద గుంతలుగా మారింది ఉష్కా అడ్డ దగ్గర నుండి రాంనగర్ వరకు పుష్క లారీలు రోడ్డు పైనే కంకర్ షాపులు రోడ్డుపైనే హార్డ్వేర్ షాపులు రోడ్డుపైనే 100 ఫీట్ల రోడ్డు చెప్పడానికి మాత్రమే 20 ఫీట్ల రోడ్డుకు మాత్రం పరిమితం చేసిన షాపు ఓనర్లు వారిపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారో సమాధానం చెప్పాలి రెండు వైపులా కాల్వల నిర్మించి 100 ఫీట్ల రోడ్డును పూర్తిగా ప్రజలకు అందుబాటులో తేవాలని మొహమ్మద్ ఇమ్రాన్ టీవైజే ఎఫ్ నియోజకవర్గ జహీరాబాద్ డిమాండ్ చేస్తున్నారు

# రాజ్‌భవన్ ముట్టడికి యత్నం షబ్బీర్ అలీ, మంత్రి వివేక్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్..

జూలై 22 ప్రజా దివాస్

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్ట్‌కు నిరసనగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) పిలుపునిచ్చిన "చలో రాజ్‌భవన్" కార్యక్రమం బుధవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చి రాజ్‌భవన్ ముట్టడికి యత్నించగా, పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీని రాజ్‌భవన్ సమీపంలో పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ నాయకుల అరెస్టులతో రాజ్‌భవన్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, రాజ్‌భవన్ వైపు వెళ్లే ప్రధాన రహదారులను దిగ్బంధించారు. నిరసనకారులను ముందుకు వెళ్లకుండా అడ్డుకోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, మందుల సామేల్, శంకర్ నాయక్, కుంభం అనిల్ కుమార్ రెడ్డితో పాటు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ ఘటనతో రాజ్‌భవన్ పరిసర ప్రాంతాలు ఉద్రిక్తంగా మారగా, పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అదనపు బలగాలను మోహరించారు. కాంగ్రెస్ నేతల అరెస్టులు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోతే కాలేజీల గుర్తింపు రద్దు

జూలై 22 ప్రజా దివాస్

హైదరాబాద్ । ఫీజు బకాయిల పేరుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తే ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కాలేజీల గుర్తింపు రద్దు చేస్తామని తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి హెచ్చరించింది. విద్యార్థులు కోరిన వెంటనే టీసీ, కండక్ట్, బోనాఫైడ్ తదితర సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించింది. ఫీజు వివాదాలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలే తప్ప విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీయొద్దని స్పష్టం చేసింది. ఆదేశాలు ఉల్లంఘించిన కాలేజీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, అవసరమైతే అనుబంధ గుర్తింపు రద్దు లేదా మూసివేత చర్యలు తీసుకుంటామని బోర్డు వెల్లడించింది.

TELANGANA BOARD OF INTERMEDIATE EDUCATION HYDERABAD




## మనసుని దోచేది ఆగస్టులోనే


'మీ మనసుని దోచుకునే కథ రాబోతుంది' అనే వ్యాఖ్యలతో తన రాబోయే చిత్ర విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది అగ్ర కథానాయిక నయనతార. ఆమె.. తమిళ నటుడు కవిన్ జంటగా రూపొందుతున్న సినిమా 'హాయ్'. ఆగస్టు 14న థియేటర్లలో విడుదల కానుంది. విష్ణు ఎడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని దర్శకుడు విఘ్నేశ్ శివన్, ఎస్ఎస్ లలిత్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా విడుదల తేదీకి సంబంధించిన ప్రోమోని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. ఇందులో చేతిలో కత్తి పట్టుకుని నవ్వుతూ ప్రశాంతంగా కనిపిస్తున్న నయనతార లుక్ ఆకట్టుకుంటోంది. రాధికా శరత్ కుమార్, వీటీవీ గణేశ్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## అఖిల్ ఎదురు చూసింది ఈ ప్రేమ కోసమే!



"ఎంతో ప్రేమించి ఈ సినిమాని చేసింది బృందం. ఆ ప్రేమని ప్రేక్షకులు, అభిమానులు తిరిగి చూపించారు. అఖిల్ ఈ ప్రేమకోసం, ప్రేక్షకుల కేరింతల కోసమే ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్నాడు. అభిమానులకు ఎలా ఉందో తెలియదు కానీ, నాకూ, చైతన్య, అఖిల్‌కూ 'లెనిన్' విజయం ఓ పండగలా ఉంది. మా ఇల్లంతా కళకళలాడుతోంది" అన్నారు అగ్ర కథానాయకుడు నాగార్జున. ఆయన, సూర్యదేవర నాగవంశీ కలిసి నిర్మించిన చిత్రం 'లెనిన్'. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించారు. మురళీకిశోర్ అబ్బూరి దర్శకుడు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం విజయాన్ని సొంతం చేసుకొంది. ఈ సందర్భంగా బ్లాక్‌బస్టర్ వైభవం పేరుతో చిత్రబృందం సోమవారం రాత్రి హైదరాబాద్‌లో వేడుకని నిర్వహించింది. కథానాయకుడు నాగచైతన్య ముఖ్య అతిథిగా హాజరై పంపిణీదారులు, ప్రదర్శన కారులకు జ్ఞాపికల్ని ప్రదానం చేశారు. నాగార్జున మాట్లాడుతూ కాల్స్‌నే నేను ఎక్కువగా నమ్ముతాను. వాళ్లు ఫోన్లు చేసి హౌస్‌ఫుల్స్ అయ్యాయి, అదనపు ప్రదర్శనల్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పే మాటలు విన్నప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. సీడెడ్, నెల్లూరు సహా అన్ని ప్రాంతాల నుంచీ అలాంటి ఫోన్ కాల్స్ లెనిన్ విడుదల తర్వాత వచ్చాయి.విడుదలకు రెండు మూడు వారాల ముందు పోస్ట్ ప్రొడక్షన్ బృందానికి సినిమాని అప్పజెబితే వాటి నాణ్యత మరోస్థాయిలో ఉంటుంది. కానీ నేను రెండు రోజుల ముందు ఇచ్చాను. దర్శకులు, సంగీత దర్శకులు, ఇతర సాంకేతిక బృందం అందరినీ నేను అభ్యర్థించేది అదే. రెండు మూడు వారాల ముందు ఫైనల్ కాపీ పూర్తి చేసి ఇవ్వాలని! ఇటీవలే విడుదలైన 'ది ఒడిస్సీ' సినిమాని ఏడాది ముందు విడుదల తేదీ ఇచ్చారు. మనం మాత్రం విడుదల తేదీల్ని ప్రకటించి, ఆ తర్వాత వాయిదా వేస్తున్నాం. ఈ సినిమా విషయంలో నేనూ అదే చేశా. గతంలో ఒక నెల రోజులు ముందే తొలి కాపీని చూసేవాళ్లం. ఈ విషయంలో నన్ను నేనే ప్రశ్నించుకుంటున్నా" అన్నారు.నాగచైతన్య మాట్లాడుతూ "తమ్ముడు అఖిల్ లేట్‌గా వచ్చినా లేటెస్ట్‌గా తనకి అండగా నిలిచారు ప్రేక్షకులు, అభిమానులు. సినిమా విజయానికి గుర్తుగా ఇలా జ్ఞాపికల్ని ప్రదానం చేసే వేడుక చేసుకుని ఎన్నాళ్లైందో! లెనిన్‌కి ఆ వేడుక చేయడం ఆనందంగా ఉంది" అన్నారు. అఖిల్ అక్కినేని మాట్లాడుతూ 'రెండో రోజు నుంచే థియేటర్లని పెంచిన పంపిణీదారులకు కృతజ్ఞతలు. అభిమానులు సంతోషంగా ఉంటే, మేం సంతోషంగా ఉంటాం" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొంది.

## 'సింహాద్రి'.. అతిపెద్ద సాహసమదే: రాజమౌళి



ఎన్టీఆర్ - రాజమౌళి కాంబినేషన్‌లో 2003లో వచ్చిన చిత్రం 'సింహాద్రి' . కెరీర్ పరంగా అటు జక్కన్నకు, ఇటు తారక్‌కు ఈ సినిమా ప్లస్ అయింది. యాక్షన్, ఎమోషన్స్, పాటలు అన్నీ ప్రేక్షకులను మెప్పించాయి. ఈ సినిమాలో ఓ సాహసోపేత నిర్ణయం గురించి రాజమౌళి ఓ సందర్భంలో వివరించారు.'సింహాద్రి'లో వేలమంది అమాయకుల ప్రాణాలను కాపాడటానికి కథానాయకుడి పాత్ర ఒక మంచి వ్యక్తిని చంపాల్సి వస్తుంది. అది సినిమాలోనే కీలకమైన సన్నివేశం. ఈ ఆలోచనను రాజమౌళి . తన కుటుంబ సభ్యులకు, చిత్రబృందానికి వివరించినప్పుడు.. ఒక హీరో ఇలా చేస్తే దాన్ని ప్రేక్షకులు అసలు అంగీకరించరని అన్నారట. అయితే, రాజమౌళి మాత్రం ఆ ఎమోషనల్ సీన్ ఈ కథకు ప్రాణమని నమ్మారు. ప్రేక్షకులు కచ్చితంగా దీనికి కనెక్ట్ అవుతారని నమ్మకంతో తెరకెక్కించారు. కట్ చేస్తే.. రాజమౌళి నమ్మకమే నిజమై, 'సింహాద్రి' ఆ సంవత్సరంలోనే అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అప్పట్లో చర్చనీయాంశంగా మారిన ఆ సన్నివేశం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా, విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది.ఇక రామౌళి - ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు సూపర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. రాజమౌళి దర్శకుడిగా పరిచయం అయిన మొదటి సినిమా స్టూడెంట్ నం.1.. ఎన్టీఆర్ కెరీర్‌లో మొదటి భారీ హిట్. ఈ కాంబినేషన్‌లో వచ్చిన రెండో సినిమా 'సింహాద్రి'.. ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసి ఎన్టీఆర్ స్థాయిని మాస్ హీరోగా అమాంతం పెంచింది. ఆ తర్వాత వచ్చిన యమదొంగ కూడా కమర్షియల్ హిట్. ఇక వీరి కాంబోలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్'.. ఇండియన్ సినిమా గర్వించదగ్గ పాన్-ఇండియా చిత్రంగా నిలిచిపోయింది.

## నేనెప్పుడూ అలాంటి రోల్స్ చేయలేదు: కాజల్ అగర్వాల్

ప్రాధాన్యత లేని పాత్రలు ఎందుకు చేయాలంటున్నారు కథానాయిక కాజల్ అగర్వాల్ ప్రాధాన్యత ఉన్న సినిమాలు చేయడమే తనకిష్టమని స్పష్టం చేశారు. జాన్వీ కపూర్ 'పెద్ది' సినిమాలోని పాత్ర చిత్రీకరణపై ఇటీవల చర్చ జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాజల్ స్పందించారు."గతంతో పోలిస్తే ఇప్పుడు దక్షిణాదిలో హీరోయిన్ పాత్రల్లో ఎంతో మార్పు వచ్చింది. సినిమాల్లో స్త్రీలను వస్తువుగా చూపించే సన్నివేశాల విషయంలో నేనెప్పుడూ గీత గీసుకుంటాను. ఇప్పటివరకూ అలాంటి పాత్రలు చేయలేదు. బాలీవుడ్‌తో పోలిస్తే నాకు సౌత్‌లో ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఎక్కువగా వచ్చాయి. హిందీలో పెద్ద పెద్ద హీరోలతో నటించినా.. అంత గుర్తింపు రాలేదు. అందుకే సౌత్ సినిమాల వైపు వచ్చాను. నాకు కావాల్సింది ప్రాధాన్యత ఉన్న పాత్రలు. దక్షిణాదిలో అలాంటివి సమృద్ధిగా వచ్చాయి. అలాంటప్పుడు నేను బాలీవుడ్‌లో సగటు పాత్రలు ఎందుకు చేయాలి? భాష నాకు ఎప్పుడూ అడ్డు రాలేదు. బాలీవుడ్ చిత్రపరిశ్రమలో ఏదీ సమయానికి జరగదు. నాకు సమయపాలన ఎక్కువ. గతంలో ఒకసారి నేను సల్మాన్ ఖాన్ కోసం చాలాసేపు ఎదురుచూశాను. ఆయన సాయంత్రం వచ్చారు. సౌత్ సినిమాల్లో నటించినప్పుడు నాకు క్రమశిక్షణ బాగా అలవాటైంది" అని కాజల్ పేర్కొన్నారు. ప్రస్తుతం, కాజల్ చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్న 'ది ఇండియా స్టోరీ'లో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. శ్రేయాస్ తల్పదే కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందిన 'రామాయణ'లోనూ ఆమె కనిపించనున్నారు.



## అప్పుడు 'బాల రామాయణం'.. ఇప్పుడు '35 చిన్న కథ కాదు'



తాజాగా జాతీయ అవార్డు గెలుచుకున్న '35 చిన్న కథ కాదు' చిత్రబృందాన్ని నిర్మాత ధీరజ్ ఓ కార్యక్రమంలో సత్కరించారు. ఆయన ప్రస్తుతం సమ్మర్ హాలీడేస్' అనే సినిమాను నిర్మిస్తున్నారు. ఈ క్రమంలోనే అవార్డు సాధించిన మరో చిత్రాన్ని వేదికపై అభినందించడంతో, ధీరజ్ ఆలోచనను దర్శకుడు నందకిశోర్ ఇమాని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నందకిశోర్ మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణంలోని పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు." 72 ఏళ్ల జాతీయ అవార్డుల చరిత్రలో.. తెలుగు చిత్రపరిశ్రమ నుంచి ఉత్తమ బాలల చిత్రంగా గతంలో గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'బాల రామాయణం' మాత్రమే ఎంపికైంది. మళ్లీ ఇన్నేళ్లకు మా సినిమాకి ఆ అరుదైన గౌరవం దక్కడం ఎంతో గర్వంగా ఉంది. నేను ఈ కథను ముందుగా కొంతమందికి చెప్పినప్పుడు విచిత్రమైన అనుభవాలు ఎదురయ్యాయి. పెళ్లైన జంట, ఇద్దరు పిల్లలు, స్కూల్ నేపథ్యం.. ఎలాంటి కమర్షియల్ హంగులు లేని ఈ కథను విని చాలామంది నిర్మాతలు సందేహించారు. కథ విన్నప్పుడు ఎక్కువ మంది భావోద్వేగానికి గురయ్యారు. కానీ, గత ఐదారేళ్లలో ఇలాంటి సినిమాకు సరైన రిఫరెన్స్ లేకపోవడంతో నిర్మించడానికి వెనకడుగు వేశారు. అయితే, ఎలాంటి రెఫరెన్స్ చూడకుండా కేవలం కథను మాత్రమే నమ్మి వాల్తేరు ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్ బ్యానెర్లపై ఈ సినిమాను నిర్మించడానికి సిద్ధార్థ్ రాళ్లపల్లి, సృజన్ ముందుకొచ్చారు. వాళ్లు ముందుకు రాకపోయుంటే నేడు మా చైల్డ్ ఆర్టిస్ట్‌కు అవార్డు వచ్చేది కాదు. నిర్మాతలు పెట్టే పెట్టుబడికి న్యాయం చేయాల్సిన బాధ్యత దర్శకుడిపై చాలా ఉంటుంది. ఒకవేళ నేను తీసిన సినిమా ఆడకపోతే.. కొత్తగా వచ్చే మరో నాలుగు ప్రయోగాత్మక సినిమాలు ఆగిపోయేవి. అందుకే కేవలం మనసుకు నచ్చే సినిమానే కాకుండా, ఆర్థికంగా కూడా నిలబడే సినిమా తీయడం ముఖ్యం. ఈ ప్రయాణంలో మమ్మల్ని గుర్తించిన భారత ప్రభుత్వానికి, జ్యూరీ సభ్యులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని నంద కిశోర్ పేర్కొన్నారు.ఇక, నివేదా థామస్, విశ్వదేవ్, ప్రియదర్శి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '35 చిన్న కథ కాదు' . నందకిశోర్ ఇమాని దర్శకత్వం వహించిన ఈ సినిమా జాతీయ స్థాయిలో సత్తా చాటిన విషయం తెలిసిందే. ఉత్తమ బాలల చిత్రంగా జాతీయ పురస్కారం గెలుచుకుంది. అలాగే, ఈ మూవీలో నటించిన అరుణ్‌దేవ్ పోతుల ఉత్తమ బాల నటుడిగా అవార్డును సొంతం చేసుకున్నాడు. విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ సినిమా 2024 ఆగస్టు 15న తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో విడుదలై విశేష ప్రేక్షకాదరణ పొందింది.

## అసలైన ఐమ్యాక్స్ సినిమా ఇలా ఉంటుందా!: అలాంటి థియేటర్లు 41 మాత్రమే



అది మెల్‌బోర్న్‌లోని ఐమ్యాక్స్ థియేటర్(. అక్కడ ఆడుతున్నది క్రిస్టఫర్ నోలన్ తెరకెక్కించిన 'ది ఒడిస్సీ. అందులో ఉన్న ప్రొజెక్టర్ రూంలోకి వెళ్లిచూస్తే, టైం మెషీన్‌లో కొన్ని దశాబ్దాల వెనక్కి వెళ్లి ఏదైనా మాయా ప్రపంచంలోకి అడుగుపెట్టామా అనిపిస్తుంది. అక్కడున్న యంత్రాలను పరిశీలిస్తే, ఇది ప్రయోగశాలనా అన్న అనుమానమూ రాకపోదు. 'ది ఒడిస్సీ'ని డిజిటల్ విధానంలో కాకుండా, ఒరిజినల్ 70 ఎంఎం ఐమ్యాక్స్ ఫార్మాట్ ఫిలిం ప్రొజెక్టర్‌తో ప్రదర్శిస్తున్న థియేటర్ ఇది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి థియేటర్లు 41 మాత్రమే ఉన్నాయి.వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, నోలన్ ఏ విజన్‌తో 'ది ఒడిస్సీ'ని తెరకెక్కించారో, దాన్ని వంద శాతం ప్రేక్షకుల ముందు ఆవిష్కరించేలా 1.43:1 యాస్పెక్ట్ రేషియో(ఫ్లోర్ టు సీలింగ్) తెరలతో ప్రదర్శిస్తున్నవి ఈ 41 మాత్రమే. వాటిలో 26 అమెరికాలో ఉండగా, యూకేలో 3, ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో 1, మిగిలినవి కెనడా, చెక్ రిపబ్లిక్ తదితర చోట్ల ఉన్నాయి. భారత్‌లో ఒక్కటి కూడా లేదు. 'ది ఒడిస్సీ'ని ప్రదర్శించడానికి ఈ థియేటర్ల ప్రొజెక్టర్ గదుల్లో జరిగే కసరత్తు చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే అంత భారీ సరంజామా అవసరం మరి.ప్రపంచ సినీ చరిత్రలో తొలిసారిగా పూర్తిస్థాయిలో ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరణ జరుపుకొన్న సినిమాగా 'ది ఒడిస్సీ' ప్రత్యేకత చాటుకున్న సంగతి తెలిసిందే. ఒరిజినల్ ఐమ్యాక్స్ థియేటర్లకు పంపిన ఈ మూవీ ఫిలిం నెగటివ్ బరువు సుమారు 384 కిలోలు ఉందట. ఒక్కో ప్రింట్‌లో ఉన్న ఫిజికల్ ఫిలిం పొడవు ఏకంగా 6.4 లక్షల మీటర్లట! ఈ ఫిలింను ప్రొజెక్టర్లలో లోడ్ చేయడానికి ఆపరేటర్లు ఎంతో శ్రమించాల్సి వస్తోందని ఐమ్యాక్స్ థియేటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. లోడింగ్ ప్రక్రియను ప్రజలకు వివరించడానికి వీడియోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వాటిని చూసి నెటిజన్లు ఐమ్యాక్స్ ఫిలిం అంటే ఇలా ఉంటుందా అని ఆశ్చర్యపోతున్నారు. ఒరిజినల్ ఐమ్యాక్స్ థియేటర్లో 'ది ఒడిస్సీ'ని చూసినప్పుడు కలిగిన అనుభూతిని మాటల్లో వర్ణించలేమని నోలన్ అభిమానులు చెబుతున్నారు. తమ దేశాల్లో ఇలాంటి సదుపాయం లేనందున, ఈ సినిమా చూడ్డానికే ప్రత్యేకంగా మెల్‌బోర్న్ టూర్ ప్లాన్ చేసుకొని వచ్చినట్లు వివిధ దేశాల ప్రేక్షకులు